# సహజీవనం

**- శశిశర్మ**

''ట్రింగ్.. ట్రింగ్.. ట్రింగ్'' ఫోను మోగుతోంది. ఏదో ఆలోచిస్తూ కూర్చున్న మీనాక్షి ఒక్కసారి ఉలిక్కిపడింది.

ఆమెకు ఒక్కక్షణం ఒళ్ళంతా చెమటలు పట్టినట్లైంది. ఫోనుకేసి భయంగా చూసింది. తనకిది ఎవరిఫోనో తెలుసు. ఆ వ్యక్తి ఎందుకు చేస్తున్నాడో కూడా తెలుసు. అయితే విశ్వనాథ్ ప్రిపేర్డ్‌గా ఉన్నాడన్నమాట. తనిప్పుడు అతను అడిగేదానికి సమాధానం చెప్పాలి. ఏం చెప్పాలి..ఎలా చెప్పాలి?

మీనాక్షికి టెన్షన్‌తో చేతివేళ్ళు వణుకుతున్నాయి. ఇవ్వాళ్టితో వారం రోజుల గడువు పూర్తయింది. తన సమాధానం కోసం అతను ఆతృతగా ఎదురుచూస్తున్నాడని తెలుసు. బట్..తనకసలు ఏం చెప్పాలో తెలియటల్లేదు.

మీనాక్షికి ఏడుపు వస్తోంది. ఎంత హీన పరిస్థితి.. ఎంత అనీజీనెస్..ఫోన్ మోగి మోగి ఆగిపోయింది. కాని, మళ్ళీ రేపిదే టైంకి, ఆ ఫోన్ మళ్ళీ మోగుతుంది. ఇవాళ తప్పించుకున్నా రేపైనా సమాధానం చెప్పాలిగా. టెన్షన్ తగ్గించుకోవడానికన్నట్లు, మీనాక్షి ఫ్రిజ్ తెరిచి చల్లటి మంచినీళ్లు గటగటా తాగేసింది. అప్పుడామెకు కాస్త రిలాక్స్‌డ్‌గా అనిపించింది.

సోఫాలో నిస్సత్తువుగా వాలిన మీనాక్షి మనసులో అనేక ఆలోచనలు.

తను చేస్తున్నది, ఆలోచిస్తున్నది ఎంతవరకు సమంజసం...అసలు తను ఇప్పుడేం చేయాలి?...ఏదో తెలియని అసంతృప్తి..

తనది, శంకర్‌ది పెద్దలు కుదిర్చిన వివాహం. జాతకాలు, సాంప్రదాయాలు అన్నీ చూసే జరిపిన పెళ్ళి తమది. మరి అతనిపట్ల తనకెందుకీ అనీజీ ఫీలింగ్.. ఇది ఇప్పటిదా..వివాహమై మూడేళ్ళు అవుతోంది. పెళ్ళైన దగ్గిర నుండి ఈ రోజు మొదలుకుని రోజూ ఏదో అసంతృప్తి...టెన్షన్..ఎందుకో నిస్సారం..కాలేజీ చదివే రోజుల్లో తను ఎంత ఆక్టివ్‌గా ఉండేది. నాట్యం, సంగీతం, నాటకాలు, ఆటలు, ఒకటేమిటి అన్నింట్లో ఎవ్వరైనా తన తరువాతే. 'మీనాక్షి' అంటేనే ఒక సెన్సేషన్. అందం, చదువు, టాలెంట్ అన్నీ తన సొత్తే.

అమ్మానాన్నల గారాబం, టీచర్ల ప్రోత్సాహం, స్నేహితుల పొగడ్తల మధ్యలో జీవితం ఇంద్రధనస్సులా వెలిగిపోయింది. చదువైపోయిన వెంటనే సరదాగా కొన్నాళ్ళు ఉద్యోగం కూడా చేసింది తను. శంకర్ అమ్మానాన్నలు ఒక పెళ్ళిలో తనని చూసి మెచ్చి, తను కావాలని వాళ్ల కోడలిగా చేసుకున్నారు. శంకర్‌కూడా తనని బాగా ఇష్టపడ్డాడని తెలుసు. చూడ్డానికి తనూహించినంత అందగాడు కాకపోయినా, మంచికుటుంబం, ఉద్యోగం అంటూ తల్లిదండ్రులు శంకర్‌తో పెళ్ళి జరిపించేసారు.

తనెన్ని ఊహించుకుంది. ఏయే కలలు కన్నది..తన అందం, చదువు, తెలివితేటలు, ఆటపాట శంకర్‌ని పిచ్చివాడిని చేస్తాయి అనుకుంది.

''నువ్వు నా భార్య కావడం నా అదృష్టం మీనూ...ఐయామ్ మాడ్ ఫర్ యు''లాంటి డైలాగ్స్ చెప్తాడేమోనని ఆశించింది. ఛీ...ఏం మనిషి ఇతడు...ఒక స్పందన లేదు. ఒక ఎక్స్‌ప్రెషన్ లేదు. మరీ ఇంత బ్రాజమానం ఏంటి?...శంకర్ ప్రవర్తనకి బాధపడని రోజు లేదు తను. తను అందంగా తయారైనా, చక్కగా వంట చేసినా, ఇల్లంతా ఎంతో కళాత్మకంగా సర్దినా...చిన్నగా నవ్వుతాడు. అంతే. అంతేగాని, ''నువ్వు రంభలా ఉన్నావని గాని...నీ వంట అద్భుతమనిగాని ఏమీ అనడు.'' పైగా తనుండబట్టలేక ''ఏమీ మాట్లాడరేమిటి'' అంటే ''చాలా బావుంది'' అంటాడు.

అంతే. మరోమాట ఉండదు. డబ్బంతా తనకే ఇస్తాడు. ఫలానాది కొందామా అంటే 'సరే' అంటాడు. ఒక ఫీలింగ్ ఉండదు. కనీసం పడకగదిలో ఉందా అంటే, అక్కడా అంతే. తను కందిపోతుంది అన్నట్టు మరీ సున్నితంగా వ్యవహరిస్తాడు.

ఛీ..అసలు **మగాడు** అంటే ఎలా ఉండాలి..తన అందానికి తాను రెచ్చిపోయి..తనని రెచ్చగొట్టి..ఉక్కిరిబిక్కిరి చేసి...ఓహ్..ఆ తన్మయత్వం ఎక్కడ..ఆ సరసాలు ఏవి...సిగ్గువిడిచి తను కాస్త 'స్పీడ్'గా ప్రవర్తించబోతే...''మీనూ..భార్యాభర్తల మధ్య ఉండాల్సినది చక్కటి స్నేహంతో కూడుకున్న దాంపత్యం. ఏం చేసినా ఆహ్లాదంగా ఉండాలి. కామంతో చేసేది దాంపత్యం కాదు.'' అంటూ లెక్చర్లు.

అందుకే...విసుగెత్తిపోయింది తను. మనసు, మాట, ప్రవర్తన, అన్నీ..అన్నీ సున్నితమే. దాన్ని సున్నితమనాలో, జడత్వమనాలో దేవుడికెరుక.

''శంకర్ దేవుడే'' అంటుంది అమ్మ. ఆవిడకేం తెలుసు తన బాధ. తన అసంతృప్తి. అందుకనే జీవితం కాస్త ఆక్టివ్‌గా ఉంటుందని, సరదాగా ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంలో జాయినైంది తను.

మీనాక్షి ఆలోచనలకి అంతు లేకుండా ఉంది. సోఫాలో పడుకున్నదల్లా లేచి కూర్చుంది.

అదిగో ఆ కంపెనీలోనే సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పరిచయమయ్యాడు విశ్వనాథ్. మంచి అందగాడు, అందంకి మించిన చక్కటి మాటకారితనం. ఆరోజు..మొదటిసారి తనతో పరిచయమైనరోజు..కంపెనీ విషయం ఏదో అడగడానికి వచ్చి తనెదుట కళ్ళప్పగించి చూస్తూ నిలుచుండి పోయాడు విశ్వనాథ్.

''మిస్టర్..వాట్ డుయువాంట్'' అనడిగింది తను.

''మైగాడ్..శిల్పాలు మాట్లాడతాయా..అందులో వీనస్ శిల్పం వాటె వండర్'' నవ్వుతూ అన్నాడతడు. ఒక్కక్షణం ఒళ్ళు ఝల్లుమన్నట్లైంది తనకి.

''సారీ మేడమ్. అందాన్ని అభినందించటం నా హాబీ. సారీ ఇఫ్ ఐ టాక్డ్ రబ్బిష్. ''మళ్ళీ అదే నవ్వు.

''నో..నో..అదేం లేదు..'' మొహమాటంగా అంది తను. అదిగో..అలా పరిచయమైంది విశ్వనాథ్‌తో.

పరిచయం అనడం కన్నా, తన 'జీవితంలో వెలుగునిండింది అనడం సబబేమో. తన కంపెనీకి తరచు వచ్చేవాడతడు. వచ్చినప్పుడల్లా తన తెలివితేటలని, తన వర్క్‌ని, తన టాలెంటుని, తన అందాన్ని పొగడకుండా ఉండేవాడు కాదు. ఒకరోజు తను సరదాగా అంది.

''విశ్వనాథ్‌గారూ..తెగ పొగిడేస్తున్నారు. ఫర్ యువర్ కైండ్ ఇన్‌ఫర్‌మేషన్..నేను మిస్ మీనాక్షికాను..మిసెస్ మీనాక్షీ శంకర్''ని తనన్న మాటలకు అంతకన్నా సరదాగా అన్నాడతడు.

''ఐనో ఇట్ మేడమ్. ఇన్‌ఫాక్ట్ శంకర్‌గార్ని మీలాంటి భార్య పొందినందుకు అభినందించాలనుకుంటున్నాను.''

ఆశ్చర్యపోయింది తను.

జెంటిల్‌మాన్. అందరిలా ఆకతాయి మనిషికాడు. ఒక్కసారి ఇంటికి పిలిచింది. భర్తకు పరిచయం చేసింది తను. అప్పట్నించి తరచూ వచ్చేవాడు.

''మీనాక్షి..ఒక్క మాట అడగనా'' విశ్వనాథ్ అన్నాడు ఒక రోజు..

ఏమిటన్నట్లు చూసింది తను.

''ఏం లేదు. మీరు, శంకర్‌గారు క్లోజ్‌గా ఉన్నట్టనిపించరునాకు. అతను చాలా డల్‌గా కనిపిస్తారు. మీరు చూస్తే, ఇంత ఆక్టివ్. ఇంటి దగ్గిర, అతని సమక్షంలో, యూ ఆల్సో లుక్ వెరీ డల్..మీ టాలెంట్స్‌ని గుర్తించినట్టు నాకన్పించదు...యామై కరెక్ట్'' విశ్వనాథ్ అన్న మాటలకి తను బరస్ట్ అయిపోయింది. శంకర్ తనని గుర్తించకపోవడం ,





కాలేజీలో తన లైఫ్, ఏమాత్రం ప్రోత్సాహం లేని ఈ రొటీన్ లైఫ్..ఏమిటో అన్నీ చెప్పేసింది అతనికి. ఒకవిధంగా చెప్పాలంటే..శంకర్‌తో తన అసంతృప్తి, తనకేం కావాలో అన్నీ చెప్పేసింది తను. ఎప్పుడు పట్టుకున్నాడో తన చేయి గట్టిగా పట్టుకున్నాడు విశ్వనాధ్.

''మీనాక్షీ..నేను చెప్పేది కామ్‌గా ఆలోచించు. నీ అందం, నీ తెలివితేటలు అన్నీ అడవిగాచిన వెన్నెల అయిపోతోంది. రసికత్వం లేని భర్త, గుర్తింపులేని జీవితం, భరించడం చాలా కష్టం. వి ఆర్ ఇన్ మాడర్న్ వరల్డ్. ఆధునిక భావాలున్న వాళ్ళం మనం. జీవితం వేస్ట్ చేసుకోకూడదు. శంకర్‌కి డైవోర్స్ ఇచ్చేయి. మనం పెళ్ళి చేసుకుందాం. షాకింగ్‌గా ఉందా..నిజం చెప్పు. ఎందుకీ రుచిలేని లైఫ్ నీకు. మనకి అన్ని భావాలు కలిసాయి. నీ టేస్ట్ నాకిష్టం. నా బిహేవియర్ నీకు కొత్త లైఫ్ ఇచ్చిందని నాకు తెలుసు. సెంటిమెంట్స్ అవన్నీ ట్రాష్, జస్ట్ ఎన్‌జాయ్ లైఫ్. శంకర్‌తో కామ్‌గా చెప్పు. అతను మన నిర్ణయానికి అడ్డురాడు. థింక్ ఓవర్. వారం రోజులు టైం తీసుకో. సరిగ్గా ఇదే రోజు, మళ్ళీ ఇదే టైంకి నేను ఫోన్ చేస్తాను. నాకేసంగతీ చెప్పాలి. ఒ.కె. నీకోసం ఈ విశ్వా పడి చస్తాడన్నది మాత్రం మర్చిపోకు. అదృష్టం ఒకేసారి తలుపుతడుతుంది. వస్తాను. శంకర్ వచ్చేవేళైంది. ఒ.కె. బై'' విశ్వనాథ్ వెళ్ళిపోయాడు.

మీనాక్షి, ఆ మాటలు విన్న ఆ రోజు తను ఎంత షాకైపోయింది గుర్తుకు తెచ్చుకుంది. చాలాసేపటి వరకు తనేమీ మాట్లాడలేదు. ఆరోజు నుంచి తనలో అంతర్మథనం. విశ్వనాథ్ మాటలు, తనకి ఏవేవో కొత్త లోకాలు చూపిస్తున్నాయి. తను కోరుకున్న థ్రిల్లింగ్ లైఫ్ అతని దగ్గర దొరుకుతుందా? అది తను అందుకోవడంలో తప్పేమైనా ఉందా. నిజమే. ఎన్నాళ్ళీ బోర్ బ్రతుకు. తనకి కావాల్సినవి అందుకోవడంలో తప్పేమిటి? శంకర్‌కి చెప్తే ఏమంటాడు. ''నీ ఇష్టం'' అని పాత డైలాగ్ అంటాడా. అటూ ఇటూ పెద్దవాళ్ళు కాస్త అరుస్తారు. మొదట్లో అందరూ అన్ని విధాల అన్నా, నాలుగురోజులు పోయాక వాళ్ళే ఊరుకుంటారు. శంకర్‌కి తన మీద ప్రేమలేదని, చెప్తుంది తాను.

మీనాక్షి ఆలోచిస్తోంది. ఇవాళ చెప్పలేకపోయినా, రేపైనా విశ్వనాథ్‌కి సమాధానం చెప్పాలి. విశ్వనాధ్ ఎంత ఆతృతగా ఉన్నాడంటే, రేపు రిప్లై ఇవ్వకపోతే, తనే ఇంటికి వచ్చేసి శంకర్‌తో డైరక్టుగా మాట్లాడేస్తాడు. అమ్మో...కాని శంకర్‌కి ఎలా చెప్పడం..ఎక్కడో మీనాక్షికి అనీజీ ఫీలింగ్..శంకర్ మంచివాడే..బట్..అతనితో లైఫ్ చాలా డ్రైగా ఉంది..



తను విశ్వనాథ్‌తో వెళ్ళిపోతానంటే ఏమంటాడు..అసలు అతని ఫీలింగ్స్ ఎలా ఉంటాయి..ఏ ఎక్స్‌ప్రెషన్స్ లేని అతనితో ఏలా చెప్పడం..కాని చెప్పాలి. విశ్శు అన్నట్లు అదృష్టం ఒకేసారి తలుపు తడుతుంది. దేవుడి దయవల్ల ఇంకా పిల్లలు, ఆ అడ్డంకులు లేవు. శంకర్‌కి పిల్లలు మాత్రం మహా ఇష్టంగా ఉండేది. తనే, ఇప్పుడే ఎందుకు ఆ లంపటం, హాయిగా లైఫ్ ఎన్‌జాయ్ చెయ్యాలి అంది. శంకర్ తనతో బహుశా ఇన్నాళ్ళలో ''పిల్లలంటే ఇష్టం'' అన్న ఒక్క ఫీలింగ్ చెప్పాడనుకుంటాను. ఒట్టి డల్ మాన్. తననవసరంగా ఆలోచిస్తోంది. విశ్వనాథ్‌ని ఇంకా వెయిట్ చేయించకూడదు. తనసలు ఇందులో టెన్షన్ పడడమెందుకు. ''నా జీవితం నా ఇష్టం'' అని చెప్పేయడమే.

శంకర్ వచ్చినట్లున్నాడు. స్కూటర్ చప్పుడైంది. ఈరోజు ఎలాగైనా చెప్పేయాలి. ఏమిటి తన చేతులు ఇలా వణుకుతున్నాయి. నో..కంట్రోల్..ఇవి పూర్వపు రోజులు కావు. భర్తే దైవం అంటూ పూజించడానికి..ఇష్టం లేనపుడు, లైఫ్‌లో తృప్తిలేనపుడు, తనకు నచ్చినచోట, నచ్చిన విధంగా ఉండే హక్కుంది. శంకర్ లోపలికి రావడం చూసింది మీనాక్షి.

''మీనూ'' శంకర్ పిలిచాడు. పలకరింపుగా నవ్వడం తప్ప ఏనాడూ అలా పిలవని శంకర్‌వైపు ఆశ్చర్యంగా చూసింది మీనాక్షి.

''ఇదిగో ఈ కాయితాలపై సంతకం పెట్టు.'' కాయితాలేవో టీపాయ్ మీద పెట్టి పెన్ను అందించాడు. ఆశ్చర్యంగా చూసిందామె.

''ఇవి...''

''ఇవి. డైవోర్స్ పేపర్లు మీనాక్షీ. దీనిపై సంతకం పెట్టు. ఈ డైవోర్స్ నేను నీకు ఇస్తున్నాను. నీ సంతోషం నాకు కావాలి. విశ్వనాథ్ నీకు అన్ని విధాల తగినవాడు. నీ నిర్ణయానికి నేనెప్పుడూ అడ్డురాను.'' శంకర్ మాటలు విని స్థాణువైంది మీనాక్షి.

''మీరు..మీరు..'' భర్తకీ విషయం ఎలా తెలుసో, అతనిలా ఎలా అనగలుగుతున్నాడో అర్థం కావటల్లేదు ఆమెకు.

''మీనూ..నాకెలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావా. నీ ప్రవర్తన, విశ్వనాథ్ నీతో అన్న మాటలు అన్నీ నాకు తెలుసు. మీనూ..నువ్వంటే నాకు పంచప్రాణాలు. నేను నిన్ను అమితంగా ప్రేమిస్తున్నాను. కాని, నా వల్ల నా ప్రవర్తన వల్ల నీకు సంతృప్తి లేదు. అది కూడా నాకు తెలుసు. ప్రేమంటే, ఆహా ఓహో అనే పొగడ్తలు, అర్థంలేని షోలు కాదని నా అభిప్రాయం. భార్యాభర్తలు ఒక్కటి నాదృష్టిలో. వారిద్దరి మధ్య ఉండాల్సినది అపూర్వమైన అనుబంధం. నిష్కల్మషమైన ప్రేమ, గౌరవం. చీటికి మాటికి నిన్ను పొగడాలని, నీ అందాన్ని పచ్చిగా పొందాలని నేనప్పుడు అనుకోలేదు. నువ్వంటే నాకు చాలా ప్రేమ, ఇష్టం. నీ తెలివి తేటలంటే నాకు గౌరవం. అది నా మనసులోని ఫీలింగ్స్. ఇవి బయటికి ఎక్స్‌ప్రెస్ చెయ్యాలని నేను ఏనాడూ అనుకోలేదు. అలా చేయడం, నీకు నచ్చలేదు. నాతో డ్రై లైఫ్ అని నీ భావన. నీకు విశ్వనాథ్ అన్ని విధాల నచ్చాడు. ప్రేమంటేనే త్యాగం. అందుకే, నాకు విపరీతమైన బాధ, ఆవేదన కలుగుతున్నా, నీ సుఖం కోసం, నువ్వు విశ్వనాథ్‌తో అనుబంధం పెంచుకొనడం, సమర్థిస్తున్నాను. కానీ మనది సాంప్రదాయమైన సమాజం. నువ్వు నాకు విడాకులు ఇచ్చి, వేరొకరిని వివాహం చేసుకుంటే లోకులు నిన్ను వేలెత్తి చూపిస్తారు. ఆ నిందేదో నా మీద పడనీ అందుకే నేనే నీకు విడాకులు ఇస్తాను. అప్పుడు బయటికి నువ్వు నన్ను 'అసమర్థుడనో' 'శాడిస్టు' అనో చెప్పచ్చు. ఆలోచించకు మీనూ..రా సంతకం పెట్టు. నీ మీద నాకు కోపం లేదు. ఎందుకంటే ఐ లవ్ యూ కనుక.''

శంకర్ మాటలింకా పూర్తిగాకుండానే మీనాక్షి ఒక్క ఉదుటున అతని చేతుల్లో వాలిపోయింది పిచ్చిగా ఏడుస్తూ. అతడేం మాట్లాడలేదు. ఆమె ఏడుపులో అతనికి అనేక అర్థాలు కనిపించాయి.

''ట్రింగ్..ట్రింగ్....అవతల ఫోన్ అలా మోగుతూనే ఉంది.

★



## శ్రీదేవి నటన!

ఏమో అలాంటి అవకాశాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. బోనీని పెళ్లాడి ఓ కూతుర్ని కూడా కన్న శ్రీదేవి కొంత కాలం విరామం తరువాత తిరిగి చిత్రాల్లో నటించే అవకాశాలు కనిపిస్తున్నాయని బాలీవుడ్‌లో సినీ జనాలు చర్చించుకుంటున్నారు. అనుపమ్ ఖేర్ స్వయంగా నిర్మిస్తూ దర్శకత్వం వహించబోయే హిందీ చిత్రంలో హీరోగా అమితాబ్‌ని ఎనుకున్న అనుపమ్ హీరోయిన్‌గా శ్రీదేవిని నటింపచెయ్యడానికి ప్రయత్నిస్తున్నాట్ట. ఇటీవలే పసిపాపకు జన్మనిచ్చిన శ్రీదేవి తిరిగి సినిమాలకు తగిన విధంగా తన గ్లామర్‌ని సంతరించుకుని 'రెడీ' అనే వరకూ అనుపమ్ ఎదురుచూడ్డానికి సిద్ధంగా వున్నాట్ట.

-జె.ఎం.